క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత

తెనాలిరూరల్‌: తెనాలికి చెందిన కుడితిపూడి రాఘవేంద్రరావు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఖర్చుల కోసం రూ. 1,53,930 చెక్కును రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ శుక్రవారం ఆయన కుటుంబసభ్యులకు బోస్‌రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

డిజిటల్‌ చెల్లింపులపై అవగాహన



తెనాలిరూరల్‌: సొసైటీ ఫర్‌ సోషల్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌ ఆధ్వర్యంలో డిజిటల్‌ చెల్లింపులపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక చినరావూరుతోట సచివాలయం వద్ద నిర్వహించారు. ఆర్‌బీఐ డిపాజిటర్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ అవేర్‌నెస్‌ కార్యక్రమంలో భాగంగా జరిగిన వర్క్‌షాప్‌కు యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా మెయిన్‌బ్రాంచి మేనేజర్‌ ఎం. శాంసన్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని ఆయన సూచించారు. యూనియన్‌ బ్యాంక్‌ రామలింగేశ్వరపేట అసిస్టెంట్‌ మేనేజర్‌ వి. కృష్ణకార్తీక్‌, ప్రాజెక్టు డైరెక్టర్‌ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్‌ మేనేజర్‌ వి.అశోక్‌ కుమార్‌, రిసోర్స్‌పర్సన్లు వై. బాబురావు, బి. నరసింహనాయక్‌, రామకృష్ణ, ప్రకాష్‌ పాల్గొన్నారు.

పార్కును ప్రారంభించిన మంత్రి మనోహర్‌



తెనాలిరూరల్‌: పట్టణంలోని చినరావూరులో పురపాలక సంఘం ద్వారా ఆధునీకరించిన శ్రీ సత్యనారాయణ లేక్‌ పార్క్‌ ప్రారంభోత్సవం శుక్రవారం సాయంత్రం సందడిగా జరిగింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ ముఖ్య అతిథిగా హాజరై పార్కును ప్రారంభించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాడిబోయిన రాధిక, వైస్‌ చైర్‌పర్సన్‌ అత్తోట నాగవేణి, కమిషనర్‌ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్లతో కలిసి పార్కులో ఆధునీకరించిన వివిధ ప్రాంతాలను ప్రారంభోత్సవం చేశారు. పిల్లల ఆట పరికరాలను చిన్నారులతో ప్రారంభం చేయించారు. గౌతమ బుద్ధుని విగ్రహం, బోటు షికారు, ఎల్‌ఈడీ లైటింగ్‌, వివిధ జంతువుల విగ్రహాలను పార్కులో ఏర్పాటు చేయగా వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, మానసారెడ్డి, అన్నాబత్తుని పద్మజ, దాసరి వీరవసంతరావు, కొమరాబత్తుని జయపాల్‌, సంజీవరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్‌ హెలెన్‌ నిర్మల, ఎంతు శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్‌ నేతకు ఘన నివాళి

తెనాలిరూరల్‌: కమ్యూనిస్టు నాయకుడు, పోస్టల్‌ ఉద్యోగుల సంఘ నాయకుడు దేవిరెడ్డి శివనాగేశ్వరరావు అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. కమ్యూనిస్టు భావజాలం కలిగిన ఉద్యోగిగా, పదవీ విరమణ అనంతరం నుంచి సీపీఐ పార్టీకి ఆయన అందించిన సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌ కుమార్‌, తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుపల్లి సింగారం, తెనాలి పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెనహర్‌, సినీ నటుడు, నాటక ప్రయోక్త విశ్వేశ్వరరావు, కర్నాటి నాగభూషణ్‌, పి. అంజయ్య, కొండలరావు తదితరులు శివనాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయి మాధవ్‌, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌ కుమార్‌ శివనాగేశ్వరరావు కుటుంబానికి సంతాపం తెలిపారు.

అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణానికి ఆటంకాలు సరికాదు

బహుజన సమాజ్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సుబ్బారావు



తెనాలి: స్థానిక రజకచెరువు కూడలి వద్ద అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణ పనులకు ఆటంకాలు పెట్టటం సమంజసం కాదని బహుజన సమాజ్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సుబ్బారావు అన్నారు. పార్టీ తెనాలి నియోజకవర్గ కన్వీనర్‌ కారుమంచి సునీల్‌ సందీప్‌తో శుక్రవారం అంబేడ్కర్‌ విగ్రహాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. విలేకరులతో మాట్లాడుతూ, రజకచెరువు సెంటర్లో అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణానికి 1996లో శ్రీకారం చుట్టినట్టు గుర్తుచేశారు. ఆ కాలంలోనే విగ్రహ నిర్మాణానికి అన్ని అనుమతులను విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తీసుకున్నట్టు చెబుతూ అనుమతి పత్రాలను ప్రదర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణాన్ని మనువాదులు అడ్డుకొని ఇక్కడ విగ్రహం పెట్టకుండా చేయాలని చూడడం హేయమైన చర్య అన్నారు. దళిత నాయకులు బొనిగల ప్రదీప్‌, దేవరపల్లి నాగరాజు, పిల్లి తిమోతి, పొందుగల ఆనంద్‌ తదితరులున్నారు.

గ్రామాల్లో అటుకుల సందడి

- కాలం మారుతున్నా తగ్గని ప్రాముఖ్యత
- చిన్న, పెద్ద, ముసలి తేడా లేకుండా ఇష్టపడేవి
- వరి పంట చేతికి రావడంతో అటుకుల మిల్లుల వద్ద సందడి



దావులూరు అడ్డరోడ్డు వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన అటుకుల మిల్లు



నల్లటి మడ్డి పదార్థంలో ధాన్యం వేసి బయటకు తీస్తున్న అటుకుల తయారీ కార్మికుడు



మిషన్‌ నుంచి అటుకులు బయటకు తీస్తున్న దృశ్యం

కొల్లిపర: పూర్వ కాలం నుంచి సంక్రాంతి పండక్కి ఇంటికి వచ్చిన బంధువులను, స్నేహితులను, ఇరుగుపొరుగు వారికూడా ఉత్తిచేతులతో పంపకుండా ఎంతో కొంత అటుకులిచ్చి లేదా పిండివంటలు గౌరవంగా పంపడం అనాదిగా వస్తున్న మన ఆచారం. ఎక్కువగా గ్రామాల్లో బడికి వెళ్లనని పిల్లాడు మారాం చేస్తే తల్లి బుజ్జగించి జేబులో కమ్మని అటుకులు, బెల్లం వేసి పంపే అలవాటు మన పూర్వీకుల కాలం నుంచి వస్తుంది. ఆంధ్రులకు అటుకుల పేరు వినగానే పురాణాల్లోని ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని మీద ప్రేమతో పేద స్నేహితుడైన కుచేలుడు అటుకులు బహుమానంగా ఇవ్వగా, శ్రీకృష్ణుడు ఆయనకు గుప్పెడు అటుకులను స్వీకరించి అష్ట ఐశ్వర్యాలు ప్రసాదిస్తాడు. అలా వారి మధ్య ఉన్న స్నేహబంధం గుర్తుకు వస్తుంది. అలా ఆనాటి నుంచి ఇప్పటి వరకు రైతులు పండిన ధాన్యాన్ని తొలిపంటగా సంక్రాంతి పర్వదినాన ధాన్యం ద్వారా వచ్చిన అటుకులను శ్రీకృష్ణుడికి నైవేద్యంగా పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. అటుకులతో బెల్లంముక్కలు, పాలు చెక్కెర కలిపి తింటారు. కాలం మారుతున్న కొద్ది ప్రజలు అటుకులతో పులిహోర వంటి రకరకాల చిరుతిళ్లు తయారు చేస్తున్నారు. గతనెలరోజుల నుంచి రైతులు వరి నూర్పిలు చేయటం వలన రైతుల ఇళ్లకు ధాన్యం రావటం సంక్రాతి పండుగ దగ్గరలో ఉండటంతో దావులూరు అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అటుకుల మిల్లులు తెరుచుకున్నాయి. దీంతో డిసెంబరు నుంచి ఫిబ్రవరి నిర్వాహకులకు పని లభించింది. అటుకులు మిల్లుల వద్ద అటుకులు కోసం వచ్చిన వారితో మిల్లుల వద్ద సందడి ఉంది.

అటుకులు తయారీ ఇలా..

డీజిల్‌ ఇంజన్‌ తో ఈ మిల్లులు నడుస్తాయి. అటుకులు తయారీ క్రమంలో తొలుత నిర్వాహకులు మట్టితో తయారు చేసిన పొయ్యి మీద 40 కిలోల బరువు కలిగిన బీడు కళాయిలు ఏర్పాటు చేసి ఇసుకలో 24 గంటలు నాన బెట్టిన ధాన్యాన్ని ఒక పర్యాయం వేయించిన తర్వాత ప్రక్కన ఉన్న డీజిల్‌ ఇంజన్‌ మిషన్‌కు అమర్చిన అటుకులు తయారు చేసే యంత్రంలో వేసి ధాన్యానికి ఉన్న పై పొట్టు పోయి యంత్రంలో ఉన్న బరువైన రాళ్ల వల్ల అటుకులు తయారవుతాయి. అక్కడి నుంచి పక్కన ఉన్న సన్నని జల్లెడలో అటుకులు పోసి నూక వేరు చేస్తారు. ధాన్యాన్ని వేపడం కోసం ప్రత్యేకంగా జీడిపిక్కల ఫ్యాక్టరీల నుంచి మడ్డి తెస్తారు. జీడి తొక్కనుంచి నూనె తీయగా వచ్చే నల్లటి మడ్డి పదార్థాన్ని వీరు పొయ్యిలలో వేసి మండిస్తారు. దీనిని బస్తా రూ.200లకు కొనుగోలు చేస్తారు. బస్తా మడ్డి 200 కిలోల ధాన్యాన్ని వేపేందుకు సరిపోతుంది. మిల్లు నిర్వాహకులు 20 లీటర్ల డీజిల్‌తో 300 మానికలు (1200కిలోల) ధాన్యం అటుకులుగా ఆడొచ్చని నిర్వాహకులు తెలిపారు. ఇలా ధాన్యాన్ని అటుకులుగా ఆడినందుకు మానిక ధాన్యంకు రూ.20 వసూలు చేస్తున్నారు. ఇలా ఆడించిన అటుకులను సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుళ్లు, బంధువులు, చుట్టుపక్కల స్నేహితులకు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకుంటారు. పట్టణాలు, నగరాలు నుంచిడి వ్యాపారులు గ్రామంలో రైతుల వద్ద నుంచి కొత్త ధాన్యాన్ని కొనుగోలు చేసి అటుకులు తయారు చేయించి టోకు పద్దతిన కిరాణా షాపుల్లోను, సూపర్‌ మార్కెట్లలో కిలో, 2 కిలోల ప్యాకెట్ల చొప్పున విక్రస్తున్నారు. మార్కెట్‌లో కిలో అటుకులు రకాన్ని బట్టి రూ.60 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు.

దేవుడికి నివేదిస్తాం



డిసెంబర్‌లో కొత్త ధాన్యం ఇంటి వస్తాయి. అదే సమయంలో దగ్గరలో సంక్రాంతి పండుగ వస్తుంది. ధాన్యం తీసుకొని పండుగ ముందే అటుకులు వేయించి పండుగ రోజు దేవుడికి నైవేద్యంగా సమర్పించి తర్వాత వచ్చిన బంధువులకు, ఇంటి అల్లుడికి, స్నేహితులకు పంచిపెడతాం. ఇది తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. ఇలా పంచడం వల్ల శ్రీకృష్ణుడు, కుచేలుడు వంటి మంచి స్నేహం వృద్ధి చెందుతుందని, పంట సమృద్ధిగా పండి రైతుల ఇళ్లల్లో పాడిపంటలకు లోటు ఉండదనేది మరొక నమ్మకం. –మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, తూములూరు

ఓహో ఇలాగా... బెల్లం తయారయ్యేది!



మున్నంగి మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల(ఆర్‌) విద్యార్థులు దుగ్గిరాల మండలంలోని శృంగారపురంలోగల బెల్లం తయారీ యూనిట్‌ వద్ద క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి అక్కడి బెల్లం తయారీ తీరుని పరిశీలించారు. వారికి బెల్లం తయారీదారులు చెరుకు నుంచి బెల్లం తయారు కావడానికి ఏఏ దశలున్నాయి.. ఎంత సమయం పడుతుంది, చెరకు రసం శుద్ధి చేయడానికి ఏయే పదార్థాలు కలుపుతారు వంటి అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్‌ షేక్‌ సంజిదాల్తానా, ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మీ కమల ,శీలం సౌజన్యరెడ్డి, ఓలేటి లక్ష్మి పాల్గొన్నారు. –కొల్లిపర

కవితాత్మను పలికించిన ‘స్వప్నవేణువు’

నేడు తెనాలిలో ఆవిష్కరణ



కొలకలూరి దేవికారాణి

తెనాలి: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయిని, కవయిత్రి కొలకలూరి దేవికారాణి రాసిన కవితల సంపుటి ‘స్వప్నవేణు’ శనివారం తెనాలిలో ఆవిష్కరించారు. స్థానిక వీజీకే భవన్‌లో సాయంత్రం నాలుగు గంటలకు ఏర్పాటయే సభలో ప్రముఖ రచయిత, దర్శకుడు జె.బాలవర్ధిరాజు ఆవిష్కరిస్తారు. మరో ప్రముఖ రచయిత శిఖా ఆకాష్‌ తొలి ప్రతిని స్వీకరిస్తారు. ముఖ్యఅతిథిగా ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, తంగిరాల సోని, అస్మతున్నీసా, పింగళి భాగ్యలక్ష్మి గ్రంథసమీక్ష చేస్తారు. స్థానిక జయప్రకాష్‌నగర్‌లో నివసిస్తున్న కొలకలూరి దేవికారాణి రూరల్‌ మండలం కొలకలూరులోని జిల్లా పరిషత్‌ హైస్కూలులో ఉపాధ్యాయినిగా చేస్తున్నారు. ప్రవృత్తి కవితా రచన. కవితల పోటీల్లో పలుసార్లు రాష్ట్రస్థాయి బహుమతులను స్వీకరించారు. దేవికారాణి తాత గోవాడ వెంకటరత్నకవి ప్రముఖ పద్యకవి. ఆయన కుమార్తె కొలకలూరి స్వరూపరాణి కూడా కవయిత్రి. స్త్రీవాదమంటే తెలియని రోజుల్లోనే ఆమె స్త్రీవాద కవిత్వం రాశారు. తొలి తెలుగు గజల్‌ను కూడా ఆమే రచించిన గుర్తింపును పొందారు. స్వరూపరాణి కుమార్తెగా దేవికారాణి కూడా కవిత్వ రచనలో విశేషంగా కృషి చేస్తున్నారు. తాను రాసిన 106 కవితలతో ‘స్వప్న వేణువు’ను తీసుకొచ్చారు.ఉపాధ్యాయిని బాధ్యతలు నిర్వహిస్తూ, ఇంటిని చక్కదిద్దుకుంటూ కవిత్వ రచన చేయాలంటే సాధారణ విషయం కాదు. అలాగని ఆమె ఊసుపోని కవిత్వమూ రాయలేదు. జన్మత సంక్రమించిన కవన విద్యను నిరంతర పఠన, రచనతో మెరుగులు దిద్దుకుంటూ వచన కవిత్వాన్ని వెలువరిస్తున్నారు. దేవికారాణి కవిత్వం పొదవునా శబద్ధం, భావం ఒకదానికొకటి తగ్గకుండా జోడు గుర్రాల్లా పరుగులు తీయటం గమనించవచ్చని ప్రముఖ కవి, రచయిత ఎన్‌ఆర్‌ తపస్వి అంటారు. ‘చెరకు ముక్క/వేపపువ్వు/ఉసిరి..అన్నీ పండించేది రైతే/ నేల గుర్రాన్ని స్వారీ చేసే రౌతే’ అని వర్ణించటంలో తన కవితాత్మత గోచరిస్తుంది.

వైభవంగా ముక్కోటి పర్వదినం

- ఆంధ్రాప్యారిస్‌లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
- ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉత్తరద్వార దర్శనం చేసుకున్న భక్తులు



వైకుంఠపురంలో గరుడవాహనంపై శ్రీలక్ష్మీపద్మావతీ సమేతుడిగా శ్రీవారు



శ్రీవిద్యాపీఠంలో ఉత్తరద్వారంలో స్వామివారు

తెనాలి: ఆంధ్రాప్యారిస్‌ తెనాలిలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఎంతో పవిత్రమైన ముక్కోటి ఏకాదశి పర్వదినాన స్వామి, అమ్మవార్ల ఉత్తర ద్వార దర్శనంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో ఉత్తరద్వార దర్శనానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. గర్భాలయం లోపలివైపునకు ఉత్తరముఖంగా గరుడవాహనంపై శ్రీలక్ష్మీ పద్మావతీ సమేతుడిగా కొలువుదీరిన శ్రీవేంకటేశ్వరుడిని తెల్లవారుజాము నాలుగున్నర గంటల్నుంచి భక్తులు దర్శించుకున్నారు. భక్తులందరూ ఉచిత క్యూలైన్లు, రూ.150, రూ.300 రూపాయల స్పెషల్‌ క్యూలైన్లలో స్వామి వార్లను దర్శించుకున్నారు. క్యూలైన్లలో వచ్చిన భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకోవడంతో పాటు గర్భాలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లను దర్శించుకుని వచ్చే లా ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు ప్రధాన ద్వారం వెలుపలి వైపుతో పాటు వైకుంఠపురం బ్రిడ్జి కింద నుండి ముత్తింశెట్టిపాలెం అయ్యప్ప గుడి వరకూ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా వాలంటీర్ల ద్వారా రద్దీని నియంత్రించా రు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌ కుంభం సాయిబాబు, పాలక మండలి సభ్యులు, ఆలయ సహాయ కమిషనర్‌ వి.అనుపమ ఉత్సవాలను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. డీఎస్పీ బి.జనార్ధనరావు నేతత్వంలో భారీగా పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐలు మల్లికార్జునరావు, ఎస్‌.రమేష్‌ బాబు, బి.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు, సిబ్బందితో కలిసి బందోబస్తు పర్యవేక్షించారు.

శ్రీగోవర్ధనస్వామి ఆలయంలో...

పట్టణ నెహ్రూరోడ్డులోని చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీగోవర్ధన స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రీ రుక్మిణి సత్యభామ సమేత గోవర్ధన స్వామి శ్రీ సువర్చల సమేత శ్రీ వేదమూర్తి వీరప్రతాపఆంజనేయ స్వామి వార్లకు విశేషంగా పూజలు నిర్వహించారు. ఈవో ఎన్‌వీఎస్‌ మల్లేశ్వరి, అర్చకులు పర్యవేక్షించారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

శ్రీకోదండరామస్వామి ఆలయంలో...

స్థానిక మారిస్‌ పేటలోని శ్రీరామభక్త అప్పల స్వామి గుడిగా పేరు గడించిన శ్రీకోదండ రామ స్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్తరద్వారం నుంచి స్వామిని దర్శించుకున్నారు. గోదాదేవికి 108 గంగాళాలతో పాయసం నివేదనను శనివారం కూడారై ఉత్సవాన్ని జరిపిస్తున్నామని ఆలయ ధర్మకర్త లంకా శివానంద కుమార్‌ చెప్పారు. భోగి రోజు సాయంత్రం పిల్లలకి భోగి పళ్లు, అనంతరం గోదా కళ్యాణం జరిపిస్తామని తెలియచేశారు. ధర్మకర్తలు కూనపల్లి నారాయణస్వామి, లంకా శివానందకుమార్‌, లంక శివఆంజనేయ ప్రసాద్‌ పర్యవేక్షించారు. విష్ణుభట్ల ఆంజనేయశాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు దినమని ధనుష్‌ సుబ్రహ్మణ్య శర్మ, కిరణ్‌ శర్మ చేశారు.

చెంచుపేట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో...

స్థానిక చెంచుపేటలోని అమరావతి కాలనీలోని శ్రీగోదా పద్మావతిసమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు. ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు తుమ్మల సత్యనారాయణ, దేవాభక్తుని ఉమా మహేశ్వర రావు, కిక్కూరి చిన్ని కృష్ణారెడ్డి, గడ్డిపాటి పుష్ప కుమారి తదితరులు పర్యవేక్షించారు.

శ్రీసీతారాముల మందిరంలో...

మార్కెట్‌ ఏరియా గాడిబావి సెంటర్‌లోని శ్రీ సీతారాముల మందిరంలో ముక్కోటి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. అర్చకులు జంధ్యాల గురునాథప్రసాద్‌ నేతృత్వంలో విశేష పూజా కార్యక్రమాలు చేశారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో...

నాజరుపేటలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ముక్కోటి పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని ఉత్తర ద్వారం నుండి దర్శించుకున్నారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

శ్రీసీతారామస్వామి ఆలయంలో...

నెహ్రూరోడ్డులోని రజకపేటలో గల శ్రీసీతారామ స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు ఆలయానికి తరలి వచ్చి ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చావలి ఆంజనేయ శర్మ, మునిపల్లి ప్రసాద్‌, రామకృష్ణ, దుర్గాప్రసాద్‌, కామేశ్వరరావు, శివరామకృష్ణ,చావలి భారతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్యాపీఠంలో....

గంగానమ్మపేటలోని శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్‌, శ్రీ విద్యాపీఠంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి విశేష పూజలు జరిపారు. 11వ తేదీన 103 గంగాళాలతో కూడారై ఉత్సవం జరుగుతుందని తెలిపారు. ట్రస్ట్‌ చైర్మన్‌ నంబూరు వెంకట కష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, కోశాధికారి గోపు రామకృష్ణ, లోకనాథం, కోన నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీ విద్యాపీఠం సాలిగ్రామ మఠంకు చెందిన జయలక్ష్మి, పాల్గొన్నారు.

శ్రీ శరణాగతి గోష్ఠి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ..

స్థానిక వీఎస్సార్‌ అండ్‌ ఎన్‌వీఆర్‌ కాలేజిరోడ్డులోని ప్రత్యేకవేదికపై శ్రీధనుర్మాసవ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శ్రీ శరణాగతి గోష్ఠి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో గత నెల 16 నుండి ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 13వ తేదీ వరకూ కొనసాగుతాయి.దనుర్మాస మహోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి రోజున మంత్రి నాదెండ్ల మనోహర్‌ వ్రత మహోత్సవాల్లో పాల్గొన్నారు.

కొల్లిపరలో....

కొల్లిపర: పవిత్ర ధనుర్మాసంలో వచ్చిన ముక్కోటి ఏకాదశి నాడు పలు ఆలయాలు పెద్ద ఎత్తున జన సంద్రంగా మారాయి. వైష్ణవాలయాల్లో భక్తులతో పోటెత్తాయి. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ-భూదేవి సహిత శ్రీనివాసుడు వైకుంఠ ఏకాదశి పుణ్యదినాన విశేష పూజలు అందుకున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వారంలో ఏర్పాటు చేసిన వైకుంఠద్వారం ద్వారా ప్రవేశం చేసి, ముక్కోటి దేవతలను దర్శించుకున్నారు. కొల్లిపర గ్రామంలోని శ్రీదేవి భూదేవి జనార్ధన స్వామి ఆలయంలో, తూములూరు, అత్తోట, మున్నంగి, వల్లభాపురం ఆయా గ్రామాలల్లోని వైష్ణవాలయాలల్లో ముక్కోటి పూజలు వైభవంగా జరిగాయి. భక్తులు ఆలయాల వద్ద బారులు దీరి వైకుంఠవాసుడిని దర్శించుకున్నారు.



పూజలు అందుకున్న జనార్ధన స్వామి

తొలి దర్శనం చేసుకున్న మంత్రి మనోహర్‌

ముక్కోటి ఏకాదశి రోజున తెనాలి వైకుంఠపురం క్షేత్రంలో రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ తొలిగా ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. భక్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేకువజామునే ఆలయానికి వచ్చిన మంత్రి మనోహర్‌కు ట్రస్ట్‌ బోర్డ్‌ చైర్మన్‌ కుంభం సాయిబాబు, సహాయ కమిషనర్‌ వి.అనుపమ ఘనంగా స్వాగతం పలికారు. ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకుని, తదుపరి గర్భాలయంలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాడిబోయిన రాధిక సహా పలువురు పట్టణ ప్రముఖులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు.



వైకుంఠపురంలో తొలి దర్శనం చేసుకున్న మంత్రి మనోహర్‌



క్యూలైన్లలో కిటకిటలాడుతున్న భక్తులు



మారీసుపేట శ్రీకోదండరామస్వామి ఆలయంలో



నాజరుపేట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో

కిడ్స్‌ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

తెనాలిరూరల్‌: పట్టణ నాజరుపేటలోని కిడ్స్‌ విజ్డం స్కూల్లో సంక్రాంతి సంబరాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పాఠశాలలో వేసిన పల్లెటూరి సెట్‌ వద్ద చిన్నారులు సాంప్రదాయ దుస్తులలో సంబరాలు జరుపుకున్నారు. షేక్‌ షఫ / యా, షేక్‌ షకియా, షేక్‌ జాస్మిన్‌ పర్యవేక్షించారు.

నెహ్రూనికేతన్‌లో సంక్రాంతి సంబరాలు

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని నెహ్రూనికేతన్‌ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరిపారు. మేనేజింగ్‌ డైరెక్టర్‌ మురళీకాంత్‌ దాసరి, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డి.గీతాకాంత్‌ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో తెనాలిలోని ‘ఇస్కాన్‌’ మందిర ఇన్‌ఛార్జి సింహగౌరదాస్‌ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అతిథులు పూజల అనంతరం చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. గోమాతకు మందనం చేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలను సందర్శించారు. వరిధాన్యాన్ని కుప్పనూర్పిడి చయటం, హరిదాసుల వేషధారణలో హరికీర్తనలు ఆలపించటం, గంగిరెద్దులు, ఎడ్లబండి, పూజారి వేషధారణలో విద్యార్థులు మంత్రాలు చదవటం, బొమ్మల కొలువు...గ్రామీణ సంక్రాంతి శోభను విద్యార్థులు కళ్లకు కట్టారు. సంస్కృతి సంపరదాయాలను బాల్యం నుండి విద్యార్థులకు నేర్పాల్సిన ఆవశ్యకతను సింహగౌరదాస్‌ ప్రస్తావించారు. నెహ్రూనికేతన్‌ వ్యవస్థాపకులు దాసరి ప్రకాశరావు, రంగలక్ష్మి దంపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



హరిదాసు కీర్తనలు



సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు

గంజాయి కేసులో రౌడీషీటర్‌ అరెస్ట్‌

తెనాలిరూరల్‌: గంజాయి కేసులో రౌడీషీటర్‌ను అరెస్ట్‌ చేసినట్టు త్రీ టౌన్‌ సీఐ ఎస్‌. రమేష్‌బాబు తెలిపారు. పట్టణ ఐతానగర్‌కు చెందిన సముద్రాల పవన్‌కుమార్‌ అలియాస్‌ లడ్డును కోర్టు ఇటీవల పోలీస్‌ కస్టడీకి ఇచ్చింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా గంజాయి కలిగి ఉన్నట్టు తేలడంతో అరెస్ట్‌ చేసి కోర్టులో శుక్రవారం హాజరుపరిచారు.